# నిజమైన ప్రేమ

కనకదండి గోపాలకృష్ణశాస్త్రి గారు

తల్లి వాకిట్లో జడఅల్లుకుంటూ బిడ్డమాట మరచిపోయి తదేకధ్యానంగా కూర్చుంది అద్దంకేసిచూస్తూను.

మూడేళ్ల చిట్టి—వాడిపోకుండా నీళ్లబిందెలోవేసి ఉంచిన గులాబిపూలను రెండుచేతులతోనూ రెండూపుచ్చుకుని తల్లిముందర నిలబడి "అమ్మా! ఇవిగోనే" అని తల్లికేసి చూపించింది చిరునవ్వుమొగంతో.

తల్లి ఆపూలు నలిగిపోతాయని భయంతో "నీకొద్దమ్మా! ఆపూలు ఇల్లా ఇయ్యి" అంది.

చిట్టి తప్పటడుగులతో వెనక్కివెడుతూ "నాకోఁ నాకోఁ" అని మొగం మీదికి వ్రేలాడుతూన్న చిన్నిజడలో పెట్టుకుంటోంది.

తల్లి "నీకునేపెడతానురా!" అంది.

చిట్టి "నాకోఁ నాకోఁ" అంటూజరిగిపోతోంది.

తల్లికి లేస్తేజడవదులై పోతుందనిభయంచేత లేవకుండానే కోపంతో "నలిపివేశావంటే కొట్టేస్తానుసుమీ! ఇల్లాతే" అంది.

బిడ్డ నవ్వుతూ తల్లికేసి చూపిస్తూ రెండుపువ్వులూ నలిపివేశేశి క్రింద పారేశింది.

తల్లి జడవొదిలేశి కోపంతోవచ్చి చిట్టిని రెండుచరుపులుచరిచి వెళ్లిపోయింది.

చిట్టి ఏడుస్తూ క్రిందదొర్లిపోయింది.

తల్లి జడవేసుకుని లోపలికివెళ్లుతూంటే చిట్టిలేచి కళ్లుతుడుచుకుంటూ దద్దురుచూపిస్తూ "ఆయే"అని అశ్రులుజార్చి తల్లి రెండుకాళ్ళూ గట్టిగాపట్టుకొని "ఏమన్నాపెట్టవే" అంది.

తల్లిహృదయం నీరై పోయింది. దద్దురుమీద చమురుతూ జలజలారాలుతూన్న అశ్రువులచేత చిట్టిశిరస్సును కొన్నిక్షణాలు తడిపివేశి ఎత్తుకునిముద్దాడింది.

చిట్టి అదిచూచి "అమ్మా! ఎందుకే అల్లా?" అని బిక్కమొగంతో తల్లి కంఠాన్ని పెనవేసుకుపోయింది.